క్లుప్తంగా

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

అయిజ: జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఎస్ఐ విజయభాస్కర్ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహనాలు మైనర్లకు ఇవ్వరాదని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా సీతారాముల వేడుకలు



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో సీతారాముల ఆలయంలో శనివారం ఘనంగా సీతారాముల వేడుకలు నిర్వహించారు. ఆయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకొని రాముల వారి ఆలయంలో సీతారాములకు, ఆంజనేయ స్వామి విగ్రహా లకు పంచామృతాలతో అభిషేకం చేశారు. భ క్తులకు జూటురి బాలస్వామి కన్యక పరమేశ్వరి కల్యాణ మండపంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణులు లక్ష్మణ్, వెంకటపతి, శ్రీనివాసులు, జయరాం, రవి, మోహన్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

నేడు వావిలాలలో అంతర్రాష్ట్ర భజన పోటీలు

ఇటిక్యాల: మండలంలోని వావిలాల గ్రామంలో శ్రీ శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం అంతరాష్ట్ర భజన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్కంఠగా క్రికెట్ పోటీలు

అయిజ: సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని సంకాపురంలో క్రికెట్ పోటీలను బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు ప్రారంభించారు. మండలంలోని ఎక్లాస్ పురంలో క్రికెట్ పోటీలను గ్రామ పెద్దలు ప్రారంభించారు. మండల కేంద్రంలో తిక్క వీరేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో కొన్ని రోజుల నుంచి నిర్వహిస్తున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠంగా సాగుతోంది. శనివారం వీర అలయన్స్, ఎన్‌జీహెచ్‌ఎస్ ఫిట్నెస్ టీంల మధ్య పోటీ కొనసాగింది. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసలు




అయిజ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మాస్టర్లు శేక్షావలి ఆచారి, మధుకుమార్‌లు అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్లు మాట్లాడారు. అయిజ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 30మంది, మారుతి తైక్వాండో అకాడమీ విద్యార్థులు 16మంది వివిధ పతకాలను సాధించారని వెల్లడించారు. జాతీయ స్థాయి కర్రస్వాము పోటీల్లో ప్రతిభ కనబరిచిన మాస్టర్ సుధీర్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో నవదీప్, రాజశేఖర్, తైక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనంపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాద ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన విదితమే. శనివారం ప్రమాదానికి గురైన వారి కుటుంబ సభ్యులు లక్ష్మీదేవి ఫిర్యాదు చేయడంతో ఎద్దుల బండిని ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



కేటీదొడ్డి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ధరూర్ గ్రామానికి చెందిన నర్సింహులు బొలేరో వాహనంలో గద్వాల నుంచి రాయచూర్‌కు రేషన్ బియ్యం తరలిస్తుండగా, పాతపాలెం వద్ద పోలీసులు వాహనం తనిఖీ చేశారు. 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని వాహనం స్వాధీనం చేసుకున్నారు. నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్రాంతి శోభ.. సంప్రదాయాల కొలువు



సంక్రాంతి వేడుకల్లో ఉపాధ్యాయులు



రంగవల్లికల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు



ఆకట్టుకునే ముగ్గులతో విద్యార్థులు



బోరవెల్లిలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

- విద్యా సంస్థల్లో ముందుగానే సంబరాలు
- అలరించిన రంగవళ్లులు

గద్వాలటౌన్: గద్వాలలో ముందుగానే సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంస్కృతి, సంప్రదాయాలు, రంగవల్లికలు, హరిదాసు కీర్తనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. నోరూరించే తెలుగువారి వంటలతో ఆ ప్రాంతం కళకళలాడింది. ఈ తరహా సంప్రదాయాలు పల్లెల్లో కనిపిస్తుంటాయి. పండగలు, సంస్కృతిక సంప్రదాయాలపై రోజురోజుకు తగ్గుతున్న ఆదరణ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణవేణి జూనియర్ కళాశాల, దయానంద విద్యామందిరం, కాకతీయ టెక్నోస్కూల్ తదితర పాఠశాలలో శనివారం సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఆయా విద్యా సంస్థల ఉపాధ్యాయులు, అ ధ్యాపకులు తెలుగు సంప్రదాయాలను విద్యా ర్థులతో పాటు పదిమందికి సంక్రాంతి పండగను తెలియజేసేలా తనవంతు ప్రయత్నం చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగవల్లికలు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, బొమ్మరిల్లు, చెరుకు గడలు, గొబ్బెమ్మలు ఇలా సంక్రాంతి పండగ ఉట్టిపడేలా ఆ ప్రాంతాన్ని అందంగా, ఆకర్షణీయంగా, ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. వాటితో పాటు పలువురు విద్యార్థులు బాలల రక్షణ, దేశ భద్రతలో సైన్యం వంటి సందేశాత్మకమైన రంగువల్లికలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులపై రేగుపండ్లు పోసి ఆశీర్వదించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సైతం గాలిపటాలు ఎగురవేసి సంతోషంగా గడిపారు. ఈ వేడుకను తిలకించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చేశారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో సంక్రాంతి పండగ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పవన్‌కుమార్ సోనూస్ ఇంగ్లిష్ అకాడమీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ అకాడమీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

గద్వాలన్యూటౌన్: చేనేత కార్మికుల సంక్షేమంలో భాగంగా, ప్రభుత్వం చేనేత అభయహస్తం పథకం అమలుకు మార్గదర్శకాలు ప్రకటిస్తూ జీఓ జారీ చేయడంతో చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం రాఘవేంద్రకాలనీలో టీపీసీసీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్ని నాగరాజు, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ, కౌన్సిలర్ శ్రీమన్నారాయణల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చేనేత కార్మికుల స్థితిగతులను గద్వాల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత సీఎం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సురేందర్, భీమేష్, శేఖర్, మునీశ్వర్, రఘు, పులిపాటి శ్రీను, రాములు, గోపాల్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

■ అయిజ మండల కేంద్రంలో చేనేత కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాగరాజు, సిద్దప్ప, శరణప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

■ రాజోళి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో చేనేత కార్మికులు సీఎం చిత్ర పటానికి పాలిభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దస్తగిరి, హసన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ముందుండాలి

శాంతినగర్: పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని వడ్డేపల్లి కస్తూర్బా పాఠశాల ఎస్ఓ పద్మ కోరారు. వడ్డేపల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల నీటి సౌకర్యం కోసం ట్యాంకు అవసరం ఉందని తెలుసుకున్న శాంతినగర్ సేవా సమితి సభ్యుడు షేక్ అస్లాం షరీఫ్ శనివారం వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును పాఠశాలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ సమస్య ఉందంటే స్పందించే గుణం ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. విద్యాభివృద్ధి, విద్యార్థుల సమస్యలపై స్పందించిన అస్లాం షరీఫ్‌కు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. . కార్యక్రమంలో శాంతినగర్ సేవాసమితి సభ్యుడు దాసవరం నాగరాజు, కస్తూర్బా గాంధీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

అలంపూర్: గాలి పటాలను ఎగరేసేందుకు వినియోగించే చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటస్వామి అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలోని దుకాణాలను ఎస్ఐ వెంకటస్వామి శనివారం తనిఖీ చేశారు. దుకాణాల్లో చైనా మాంజా విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. సంక్రాంతి పండగలో గాలి పటాలను ఎగరవేయడానికి చైనా మాంజాను వినియోగించరాదన్నారు. చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నా, వినియోగిస్తున్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

కిరాణ దుకాణాల్లో పోలీసుల తనిఖీ

ధరూరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో నిషేధిత చైనా మాంజాను కిరాణ దుకాణాల్లో విక్రయిస్తారన్న సమాచారంతో ధరూరులో పోలీసులు తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో కిరాణ దుకాణాల్లో ఎస్ఐ అబ్దుల్ షుకూర్ నేతృత్వంలో తనిఖీ చేశారు. ఎవరైనా చైనా మాంజాను ఎగరవేస్తే 100కు డయల్ చేయాలన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడు జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజోళి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో వెలిసిన స్వయంభు లక్ష్మీమాధవ స్వామి జాతర మహోత్సవాలు ఈ నెల 13న నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని గ్రామ పెద్దలు, జాతర మహోత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

14న అభయాంజనేయ స్వామి రథోత్సవం

ఎర్రవల్లి: మండలంలోని బి.వీరాపురం గ్రామంలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని ఈ నెల 14న అభయ ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవం విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు

ఎర్రవల్లి: మండలంలోని జింకలపల్లిలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని సోమవారం టెన్నిస్ బాల్ (జేకేపీఎల్ ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు యూత్ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఇటిక్యాల: సాతర్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా 13న వాల్మీకి యూత్ ఆధ్వరంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అతుకుల గతుకులేనా..?

- అలంపూర్ – రాయచూర్ రోడ్డుపై గుంతలకు చాలని అతుకులు
- తరచూ ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- ప్యాచ్‌లు వేసిన నెల రోజులకే పాడైన వైనం



పైపాడు స్టేజీ సమీపంలో కంకరమయంగా మారిన అలంపూర్- రాయచూర్ రోడ్డు

శాంతినగర్ : మూడు రాష్ట్రాలను కలిపే ప్రధాన రహదారి అది. దారి పొడవునా గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడటమేగాక వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్ చౌరస్తా- రాయచూర్ ప్రధాన రెండు లైన్ల రహదారి పోతులపాడు స్టేజి నుంచి తెలంగాణ సరిహద్దు వరకు గుంతలమయంగా మారింది. రద్దీగా ఉండే రహదారి బాగాలేక వాహనాలు అదుపు తప్పడం, ఓవర్‌టేక్ చేసే సమయంలో ఢీకొట్టడం జరుగుతోంది. దీంతో ప్రయాణీకులు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. అంతేగాక అలంపూర్ చౌరస్తా నుంచి అయిజ వరకు ఉన్న 42 కిలోమీటర్ల రహదారి బాగోలేక ప్రయాణం ఆలస్యమవుతుందని వాపోతున్నారు.

నెల రోజులకే పాడైన రోడ్డు..

రెండు నెలల క్రితం అలంపూర్- రాయచూర్ రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. వెట్ మిక్స్ వేసే సమయంలో ఆర్ అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నాణ్యత పాటించలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వెట్‌మిక్స్ తొలగిపోవడంతో రోడ్డంతా కంకరమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని ప్రయాణికులు తెలిపారు.

కొత్త రోడ్డు వేయాలి..



శాంతినగర్ నుంచి కలుకుంట్ల వరకు గతంలో ఉన్న సింగిల్ రోడ్డుకు ప్యాచ్ వేసి డబుల్ రోడ్డుగా మార్చారు. అయిజ వైపు మాత్రం ఐదడుగుల మేర రోడ్డు తవ్వి కొత్తగా రోడ్డు వేశారు. నల్లరేగడి భూములు అయినందున తరచూ గుంతలు పడుతున్నాయి. కొత్త రోడ్డు వేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి.

– ఆంజనేయులు, పైపాడు

కంకర పోస్తారు.. వదిలేస్తారు..



అలంపూర్- రాయచూర్ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు మూడు నెలల క్రితం చేపట్టారు. నాణ్యత లేకుండా పనులు చేపట్టడంతో నెల రోజులకే యథాస్థితికి చేరుకుంది. వాహనాలు అదుపుతప్పి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయిజ, ఎరగిర రోడ్డు మరీ అధ్వాన్నంగా మారింది. ప్రమాదాలకు నిలయంగా మారింది.

– రామకృష్ణ, పర్దిపురం

వారంలో ప్యాచ్ పనులు పూర్తి చేయిస్తాం..

అలంపూర్ చౌరస్తా నుంచి శాంతినగర్ వరకు గుంతలు పడిన చోట వెట్‌మిక్స్ వేశారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ వేరే రోడ్డు పనులు చేస్తున్నారు. వారం రోజుల్లో అలంపూర్- శాంతినగర్ వరకు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయిస్తాం. నాణ్యత విషయంలో రాజీపడకుండా రోడ్డు పనులు చేయిస్తున్నాం..

– రాజేశ్వరి, ఆర్అండ్‌బి జేఈ, అలంపూర్ డివిజన్

వైసీపీ నేత సజ్జలకు ఘన స్వాగతం



టోల్‌ప్లాజా వద్ద సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏపీ ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వైసీపీ నేతలు స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హైదరాబాదు నుంచి కడపకు వెళ్లారు. ఈ విషయం తెలియడంతో మేయర్ రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాల అధ్యక్షులు ఎస్‌వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, కేడీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ విజయమ్మలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లేపాక్షి హోటల్ యాజమానులు భాస్కర్‌రెడ్డి, లోకారెడ్డిలు సైతం వారిని కలిశారు. వారితో పాటు స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్: తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డేర ముద్దుబిడ్డ వడ్డె ఓబన్న జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ చౌరస్తాలో శనివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓబన్న చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాల నాయకులు వేరువేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జెడ్పీ మాజీ చైర్ పర్సన్ సరిత కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సే వలను, ధీరత్వాన్ని కొ నియాడారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నా యకులు కౌన్సిలర్ కృష్ణ, నాగరాజ, శ్రీరాములు, హుస్సేన్, దే వేందర్, సుజాత, రా ధాకృష్ణ, లక్ష్మన్న, నర్సింహులు, బాబు, గోపాల్, పరశురాముడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన వారికి సన్మానం

ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం పొందిన సంతోష్, శిరీషలను సంఘం తరపున సన్మానం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు.

■ అయిజ మండల కేంద్రంలో వడ్డెర సంఘం నాయకులు వడ్డెర ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు నాగన్న, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మల్దకల్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని శనివారం మండలంలోని నేతువానిపల్లి లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుని క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. అంతకుముందు ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రాజారెడ్డి, సత్యారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, పెద్ద వీరన్న, వీరేష్, వెంకటన్న, అజయ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ఉన్నత శిఖరాలు

గద్వాలటౌన్: ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పేర్కొన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని జమ్మిచేడు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జమ్మిచేడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలు లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. పట్టుదల, శ్రద్ధ అనేది క్రీడల వల్ల అలవడతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శారదమ్మ, నాయకులు మధుసూదన్‌బాబు, సురేష్, తిమోతి, ఆనంద్, నాగరాజు, ఇసాక్, వెంకట్రామిరెడ్డి, శెట్టిఆత్మకూర్ లక్ష్మణ్, ఏకే వెంకటన్న, రాము పాల్గొన్నారు.

సీసీరోడ్డుకు భూమి పూజ



బైరాపురంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్, కాంగ్రెస్ నాయకులు

ఉండవెల్లి: మండలంలోని బైరాపురంలోని ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్డు నిర్మాణానికి అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డెన్న భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రోడ్డు దెబ్బతినడంతో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు సీసీ రోడ్డును మంజూరు చేయగా, కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోపాల్, మార్కెట్ యార్డు డైరెక్టర్ నాగరాజు, శ్రీకాంత్, నాగేష్, రమేష్, రమణ, పాండు, రమేష్, మద్దిలేటి, రవి, చాంద్‌బాషా, పుల్లన్న పాల్గొన్నారు.

రాయపురంలో సందెపురాళ్ల పోటీలు



రాయపురంలో సందెపురాళ్ల పోటీలు ప్రారంభిస్తున్న హనుమంతునాయుడు

గట్టు: మండలంలోని రాయపురంలో నిర్వహిస్తున్న గోకరమయ్య ఉర్సు సందర్భంగా శనివారం సందెపురాళ్ల పోటీలను బీఆర్ఎస్ నేత బల్గెర హనుమంతునాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పండుగలను అన్ని వర్గాల వారు కలిసి మెలిసి చేసుకోవడం సంతోషాన్ని కల్గిస్తుందన్నారు. శేఖర్‌నాయుడు, నూర్‌పాషా, శ్రీరాములు, రామునాయుడు, రాజునాయుడు, తిమ్మప్పగౌడు, వీరేష్; తిమ్మప్ప, ఓబులేష్, మారెప్ప, తిమ్మారెడ్డి,నర్సింహులు, అంజనేయులు, కామేష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతా రామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. కొంతమంది భక్తులు స్వామి వారికి దాసంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఆలయ సిబ్బంది గురునాథ్, ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పెద్దదిన్నెలో ఊరేగింపునకు ముస్తాబైన రథోత్సవం

ఇటిక్యాల: మండలంలోని పెద్దదిన్నె వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలలో భాగంగా నాల్గవరోజు వివిధ పూజా కార్యక్రమాలు వేద పండితులు మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, అర్చకులు, గ్రామ ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.